



సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ ఆల్ ఇండియా లీగల్ సెల్ అధ్యక్షుడు అలోక్ కుమార్, పాల్గొన్న చిన జీయర్ స్వామి

ముగిసిన వీహెచ్‌పీ న్యాయవాదుల జాతీయ సమావేశాలు

- హాజరైన చిన జీయర్ స్వామి

శంషాబాద్ రూరల్, జూలై 14: శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లో గల త్రిదండి చిన జీయర్ స్వామి ఆశ్రమంలో రెండు రోజుల పాటు నిర్వహించిన విశ్వహిందూ పరిషత్ న్యాయవాదుల విభాగ 3వ జాతీయ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ సమావేశాలను శనివారం చిన జీయర్ స్వామి ప్రారంభించారు. వీహెచ్‌పీ కేంద్రీయ అధ్యక్షుడు అలోక్‌కుమార్, జాతీయ సహాయ ప్రధాన కార్యదర్శి సురేంద్రజైన్, లీగల్ సెల్ జాతీయ కన్వీనర్ దిలీప్ త్రివేది, కో-కన్వీనర్ అభిషేక్, శ్రీనివాస్, పలువురు సుప్రీం కోర్టు, హైకోర్టుల మాజీ జడ్జిలు, వివిధ రాష్ట్రాల నుంచి 150 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాల అజమాయిషీ నుంచి హిందూ ఆలయాలను విడిపించేందుకు చేపట్టాల్సిన న్యాయ ప్రక్రియ, వక్ఫ్ బోర్డు దురాక్రమణలకు అడ్డుకట్ట వేయడం, రాజ్యాంగ విరుద్ధమైన ఈ చట్టాన్ని రద్దు చేయడం, దేశంలో ప్రమాదకరంగా మారిన జనాభా అసమతుల్యత, కామన్ పాపులేషన్ పాలసీ, యూనిఫాం సివిల్ కోడ్ అమలు, ముస్లిం రిజర్వేషన్ రద్దు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించామన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా అమలువుతున్న చట్టాలపై వీహెచ్‌పీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఉద్యమాలు చేపట్టేందుకు తీర్మానించినట్లు తెలిపారు. జాతీయ సమావేశాల్లో వీహెచ్‌పీ తెలంగాణ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ జన్మత్, రాష్ట్ర కో-కన్వీనర్లు నర్సింహారావు, రాధికాశర్మ, శ్యామ్‌సుందర్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా బోనాలు



మండలంలోని గడ్డమల్లాయగూడలో ఆదివారం సాయంత్రం గ్రామస్తులు మహంకాళి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాన్ని అలంకరించి శివసత్తులు, పోతురాజుల విన్యాసాల మధ్య ఆలయానికి తరలివెళ్లారు. ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. బోనాల సందర్భంగా గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

యాచారం, జూలై 14



ఎర్రోనిగూడకు వెళ్లే మట్టి రోడ్డు

అడుగుకో గుంత.. వాహనదారుల చింత!

- అధ్వానంగా మారిన బీటీ రోడ్లు
- వాహనదారులు, స్థానికుల ఇక్కట్లు
- మరమ్మతులు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు

షాబాద్, జూలై 14 : మండలంలోని పలు గ్రామాల బీటీ రోడ్ల దశ ఎప్పుడు మారుతుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక ఒక్కసారైనా మరమ్మతులకు నోచుకోని ఈ రోడ్లను కాంగ్రెస్ ప్రభుత్వమైనా చేపడుతుందో లేదోనని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే మట్టిరోడ్లు బురదమయం అవుతున్నాయి. వాహనాల రాకపోకలతో మట్టి రోడ్లపై భారీ గుంతలు ఏర్పడి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రాత్రి పూట ఈ రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు జంకుతున్నారు. బస్సులు, పాఠశాలల వాహనాలు గుంతల్లో దిగబడుతున్నాయి. వేసవి వచ్చిందంటే మట్టి రోడ్లపై దుమ్మూ, ధూళితో ప్రయాణికులు, ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. పెదవేడు, పోలారం, ఎర్రోనిగూడ, గోపిగడ్డ, లింగారెడ్డిగూడ, అంతిరెడ్డిగూడ, అంకుగూడ, రేగడిదోస్వాడ నుంచి బొబ్బిలిగామ వరకు ఉన్న మట్టిరోడ్లతో ప్రజలు ఇబ్బదులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు బీటీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే బోడంపహాడ్, మన్మర్రి, అప్పారెడ్డిగూడ గ్రామాలకు వెళ్లే తారు రోడ్డు గుంతలమయంగా మారింది. అంతారం గేటు నుంచి అప్పారెడ్డిగూడ వరకు 8 కిలోమీటర్ల మేర రోడ్డుపై అడుగుకో గుంత ఉంది. మల్లారెడ్డిగూడ గేటు నుంచి ఎర్రోనిగూడ వరకు 3 కిలోమీటర్లు రోడ్డంతా గుంతలమయమే! ఈ రోడ్లులో వెళ్లేందుకు వాహనదారులు జంకుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల ఈ రోడ్డుగుండా వెళ్లకుండా దూరమైనా ఇతర దారుల్లో వెళ్తున్నారు. వర్షాలకు ఆ గుంతల్లో నీరునిలిచి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బైక్‌లు అదుపు తప్పి పడిపోయిన సంఘనటనలెన్నో ఉన్నాయి.



గుంతలమయంగా బోడంపహాడ్-మన్మర్రి బీటీ రోడ్డు



మా గ్రామానికి బీటీ రోడ్డు వేయాలి

ఎర్రోనిగూడకు బీటీ రోడ్డు నిర్మించాలి. వర్షాకాలంలో రోడ్లన్నీ బురదమయంగా మారడంతో విద్యార్థులు స్కూలుకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట గుంతలమయమైన ఈ రోడ్లపై ద్విచక్ర వాహనాలు పడిపోయి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని బీటీ రోడ్డును నిర్మించాలి.

- సామ విజయ్‌కుమార్‌రెడ్డి, ఎర్రోనిగూడ



రోడ్ల పనుల కోసం ప్రతిపాదనలు పంపాం

పెదవేడు, పోలారం గ్రామాల రోడ్లు మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారుల ఆదేశాలు, నిధులు వచ్చిన తరువాత పనులు ప్రారంభిస్తాం. ఇతర గ్రామాలకు సంబంధించి కూడా ప్రతిపాదనలు పంపుతాం. త్వరలోనే మండల పరిధి రోడ్ల మరమ్మతులతో వాహనదారుల సమస్యలు తీరుతాయి.

- శ్రీదివ్య, పంచాయతీ రాజ్ ఏఈ, షాబాద్

పలు అభివృద్ధి ప్రాజెక్టుల రాకతో రంగారెడ్డి జిల్లాకు మహర్దశ పట్టనుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని, దీనికి మరింత ఊతం ఇచ్చేలా ప్రభుత్వం నూతన ప్రాజెక్టులను చేపట్టనుందని పేర్కొన్నారు. ఆదివారం అబ్దుల్లాపూర్ మెట్ మండలం లష్కర్‌గూడ తాటివనంలో గౌడన్నలకు రక్షణ కవచం కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా సీఎం హాజరై ప్రసంగించారు. గతంలో ఔటర్ రింగ్ రోడ్డు, ఎయిర్‌పోర్టు వంటి బడా ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే వచ్చాయన్నారు. రానున్న కాలంలో న్యూయార్క్ నగరానికి పోటీ పడేలా మహేశ్వరంలో నూతన పర్యాటక నగరాన్ని నిర్మించనున్నామని తెలిపారు. కుల వృత్తుల వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.



కార్యక్రమానికి హాజరైన గీత కార్మికులు, స్థానిక ప్రజలు

మహేశ్వరంలో.. పర్యాటక నగరం

ప్రపంచంలోనే అత్యద్భుతంగా తీర్చిదిద్దుతాం

- అభివృద్ధి ప్రాజెక్టులతో జిల్లాకు మహర్దశ!
- న్యూయార్క్ నగరంతో పోటీపడేలా మహేశ్వరంలో నూతన నగరాన్ని నిర్మించే బాధ్యత సర్కారుదే
- హైదరాబాద్ ఫార్మా భూముల్లో యూనివర్సిటీలు, మెడికల్ టూరిజం, పరిశ్రమల ఏర్పాటు
- రాచకొండ ప్రాంతాన్ని ఫిల్మ్ ఇండస్ట్రీ కేంద్రంగా మార్చుతాం
- త్వరలోనే హయత్‌నగర్‌కు మెట్రో.. నేరుగా ఎయిర్‌పోర్ట్‌కు చేరుకునేలా ప్రణాళిక
- ఔటర్ రింగ్ రోడ్డుతో జిల్లాలో పెరిగిన భూముల విలువ
- గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి-రంగారెడ్డి అర్బన్, జూలై 14): రంగారెడ్డి జిల్లాకు మహర్దశ రానుందని, ప్రపంచంలోనే అద్భుత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడ తాటివనంలో సీఎం ఆదివారం ఈత మొక్క నాటారు. గౌడన్నలతో సీఎం, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రులు సహపంక్తి భోజనాలు చేశారు. గీత కార్మికులకు బీసీ కార్పొరేషన్ ద్వారా కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ పథకాన్ని సీఎం ప్రారంభించారు. ఈ కిట్ పనితీరును బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి బుర్ర వెంకటేశం సీఎంకు వివరించారు. అనంతరం గీత కార్మికులతో సీఎం ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఎం ప్రసంగిస్తూ.. అమెరికాలోని న్యూయార్క్ నగరంతో పోటీ పడేలా మహేశ్వరంలో ఒక అత్యద్భుత నగరాన్ని నిర్మించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఊటీ కంటే మెరుగ్గా రాచకొండ ప్రాంతాన్ని ఫిల్మ్ ఇండస్ట్రీకి అణువుగా మార్చబోతున్నామన్నారు. ఓడిపోయి ఫామ్ హౌస్‌లో ఉన్నోళ్లను అడుగుతున్నా.. ఔటర్ రింగ్ రోడ్, ఫార్మా ఇండస్ట్రీ, అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వాలు కాదా? అని ప్రశ్నించారు. తామేం తెచ్చారో ప్రజలకు చెప్పాలని మాజీ పాలకులకు సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు చేపట్టిన అభివృద్ధి పనులతోనే జిల్లాలో భూముల విలువ పెరిగిందన్నారు. డ్రగ్స్, గంజాయిలను సమూలంగా నిర్మూలిస్తామన్నారు. త్వరలోనే హయత్‌నగర్‌కు మెట్రో రానుందని, ఇందుకు ప్రణాళికలూ పూర్తయ్యాయని తెలిపారు. హయత్‌నగర్‌లో మెట్రో ఎక్కితే ఎయిర్‌పోర్ట్‌కు చేరుకునేలా ప్రణాళికను రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. ఫార్మా కంపెనీల కోసం సేకరించిన భూముల్లో వివిధ యూనివర్సిటీలను, మెడికల్ టూరిజం, పరిశ్రమల ఏర్పాటు చేసేలా పథకాలను రూపొందిస్తున్నట్లు చెప్పారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో తాటి వనాలు తగ్గుతున్నాయని, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల్లో తాటి, ఈత చెట్లు పెంచుతామని తెలిపారు. వన మహోత్సవంలో తాటి, ఈత చెట్లను పెంపకం చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. చెరువు కట్టలపై ఈత మొక్కలు నాటేలా అధికారులతో చర్చించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు సూచించారు. గౌడన్నలు పౌరుషానికి, పోరాటాలకు ప్రతీకలని కొనియాడారు. జిల్లాకు ఎన్నో కీలక ప్రాజెక్టులు తేవటంలో మాజీ మంత్రి టి.దేవేందర్‌గౌడ్ కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం కుల వృత్తుల కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. కుల వృత్తుల వారు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి ఉన్నతాధికారులుగా తీర్చిదిద్దాలని సీఎం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, డి.శ్రీధర్‌బాబు, భువనగిరి ఎంపీ శ్యామాకిరణ్‌కుమాంర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మహేందర్‌రెడ్డి, దయానంద్, మల్లేశం, ఎవీఎన్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఆర్డీవో అనంతరెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'పట్నం' నియోజకవర్గానికి ఐటీ కంపెనీలు తెండి

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలో ఐటీ కంపెనీల ఏర్పాటుకు కృషిచేయాలని సీఎం రేవంత్ రెడ్డిని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు. నియోజకవర్గంలో వందల ఎకరాల్లో ప్రభుత్వ భూములున్నాయని, వాటిల్లో ఐటీ కంపెనీల ఏర్పాటుకు కృషిచేయాలని కోరారు. దాంతో నిరుద్యోగులకు అవకాశాలు లభిస్తాయన్నారు. కోహెడలో ఫ్రూట్ మార్కెట్ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత పాలకులు 'పట్నం' నియోజవర్గంలోనే 2వేల ఎకరాల భూములను అమ్మేశారని ఆరోపించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పక్కన స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు



నూతన రక్షణ కవచాలతో తాటి చెట్లు ఎక్కిన గీత కార్మికులు

ఇన్‌చార్జిలు ఇంకెన్నాళ్లు?

- ఐదు మండలాల్లో ఎంఈవో పోస్టులు ఖాళీ
- పట్టించుకోని ఉన్నతాధికారులు.. అస్తవ్యస్తంగా పాఠశాలల నిర్వహణ

చేవెళ్ల, జూలై 14 : ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యా వ్యవస్థ కుంటుపడుతోంది. చేవెళ్ల నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఎంఈవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్నేళ్లుగా ఇన్‌చార్జి ఎంఈవోలతో కాలం వెళ్లదీస్తున్నారు.దీంతో పాఠశాలల పర్యవేక్షణ సరిగ్గా లేక పాఠశాల విద్య గాడితప్పుతోంది. ప్రభుత్వ ఉపాధ్యాయులపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడి వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇక ప్రైవేట్ పాఠశాలల గురించి పట్టించుకునే నాథుడే లేడు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం చెప్పిందే వేదంగా నడుస్తోంది. నిబంధనలను తుంగలో తొక్కి విద్యను వ్యాపారంగా మార్చుకుంటూ తల్లిదండ్రులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇన్‌చార్జి ఎంఈవోల స్థానంలో రెగ్యులర్ అధికారులను నియమించి విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాలని తల్లిదండ్రులు, మేధావులు కోరుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా

చేవెళ్ల నియోజకవర్గంలో 264 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో ప్రాథమిక పాఠశాలలు 170, ప్రాథమికోన్నత 42, ఉన్నత పాఠశాలలు 52 ఉన్నాయి. వీటికి అదనంగా ఐదు మండలాల్లో కేజీబీవీ, ఆదర్శ, బీసీ, ఎస్సీ, మైనార్టీ గురుకుల పాఠశాలలు కొనసాగుతున్నాయి. వీటల్లో మొత్తం 25వేల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణకు మండలానికో ఎంఈవో అవసరం. అయితే కొన్నేళ్లుగా ఈ పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. ప్రభుత్వం ఎంఈవో పోస్టులకు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ నిర్వహించడం లేదు. పీజీహెచ్ఎంలు, సీనియర్ అధ్యాకుల ప్రమోషన్లతోనే చాన్నాళ్లుగా ఎంఈవో పోస్టులను భర్తీ చేస్తోంది. అలా అయినా మండలానికొకరు కాకుండా రెండు, మూడు మండలాలకు ఒకరు చొప్పున ఇన్‌చార్జి ఎంఈవోలు పనిచేస్తున్నారు. దీంతో ఏ మండలానికీ వారు సరైన న్యాయం చేయలేకపోతున్నారు. చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాలకు కలిపి ఇన్‌చార్జి ఎంఈవో ఉన్నారు. ఆయనే శంకర్‌పల్లి మండలం జన్వాడలోని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగానూ బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. అటు హెచ్ఎంగా, రెండు మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోగా త్రిపాత్రాభినయం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే షాబాద్ మండల ఇన్‌చార్జి ఎంఈవోగా షాద్‌నగర్ రెగ్యులర్ ఎంఈవో కొనసాగుతున్నారు. మొయినాబాద్ మండలం కనకమామిడిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంను మండల ఇన్‌చార్జి ఎంఈవోగా నియమించారు. ఆయనకే శేరిలింగంపల్లి మండల అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే నవాబ్‌పేట్ మండలం ఎక్‌మామిడి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నవాబ్‌పేట్ మండల ఇన్‌చార్జి ఎంఈవోగా కొనసాగుతున్నారు. ఆయనే మెమిన్‌పేట ఇన్‌చార్జి ఎంఈవోగానూ కొనసాగుతున్నారు. ఈ ఇన్‌చార్జి ఎంఈవోలు తమ పాఠశాల నిర్వహణ బాధ్యతలు, మండల ఇన్‌చార్జి బాధ్యతలు చూసుకుంటున్నారు. దీంతో అన్ని పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది. టీచర్ల సమయపాలన, విద్యా బోధనలపై అజమాయిషీ తప్పింది.



చేవెళ్ల మండల విద్యా వనరుల కేంద్రం

ఇష్టారాజ్యంగా ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు

చేవెళ్ల డివిజన్‌లోని ప్రైవేట్ పాఠశాలలపై పర్యవేక్షణ లేకపోవడంతో ఆ పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల విషయంలో, పుస్తకాలు, స్కూల్ డ్రెస్సుల అమ్మకాలు సాగిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలో వారిని కట్టడి చేసేవారే కరువయ్యారు. పాఠశాలల్లో పుస్తకాలు, బుక్కులు, డ్రెస్సులు అమ్మొద్దనే నిబంధన ఉన్నా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయాల ఫీజులు వసూలు చేస్తున్నారు. కొన్ని ప్రైవేట్ స్కూళ్లను ప్రభుత్వ అనుమతి లేకుండా నడిపిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో ఆటాలాడుకుంటున్నా ప్రశ్నించే వారు లేకుండా పోయారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సదుపాయాలు లేవు. అనుమతిలేని పాఠశాలల విషయం మండల, జిల్లా విద్యా శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. పాఠశాలల యాజమాన్యాలు ఇచ్చే ఆమ్యామ్యాలకు అలవాటు పడే చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇంత తతంగం జరుగుతున్నా ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తనిఖీలు చేసి ప్రైవేట్ పాఠశాలల వ్యవహారంపై కొరడా ఝులిపించాలని ప్రజలు కోరుతున్నారు.

చిక్కరు.. దొరకరు!

చేవెళ్ల నియోజకవర్గంలో ఇన్‌చార్జి ఎంఈవోలు నిత్యం అందుబాటులో ఉండాల్సి ఉండగా రెండు మండలాల చొప్పున ఇన్‌చార్జి బాధ్యతలతో వారు ఏ మండలంలో ఎప్పుడు ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇన్‌చార్జి ఎంఈవోలు చిక్కరు.. దొరకరు అన్నట్టుగా తీరు ఉంది. కార్యాలయానికి వస్తే స్కూల్ విసిట్ అని, స్కూళ్లకు వెళ్తే కార్యాలయ పని చెబుతున్నారు. రెగ్యులర్ అధికారి లేక మండల వనరుల కేంద్రాల్లో ఉండాల్సిన సిబ్బంది సైతం తమ విధులను ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. అజామాయిషీ, పట్టించుకునే వారు లేక ఎవరికి వారే.. యమునా తీరే అన్న చందంగా మండలాల్లో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందనడంతో ఎలాంటి సందేహం లేదు!

విద్యుత్ బిల్లులు

టీజీఎస్‌పీడీసీఎల్ యాప్‌లో చెల్లించాలి

వికారాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులను చెల్లించే వినియోగదారులు ఇకపై నుంచి టీజీఎస్‌పీడీసీఎల్ యాప్‌లో లేదా టీజీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో కానీ చెల్లించాలని వికారాబాద్ పట్టణ ఏఈ పూర్ణచందర్‌రావు తెలిపారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం 2024, జూలై 1వ తేదీ నుంచి ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే వంటి థర్డ్ పార్టీ యాప్‌లో విద్యుత్ బిల్లుల చెల్లింపులను నిలిపివేశారని ఆయన చెప్పారు. విద్యుత్ వినియోగదారులు టీజీఎస్‌పీడీసీఎల్ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, దాంట్లో యూఎస్‌సీ నెంబర్, మొబైల్ నెంబర్‌ను ఎంట్రీ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. తర్వాత పే బిల్లు ఆప్షన్‌పైన క్లిక్‌చేసి బిల్లు చెల్లింపులు చేయవచ్చన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించే విషయంలో ఎలాంటి సందేహాలు ఉన్నా 9440814041, లేదా 9440813081కు కాల్ చేసి నివృత్తి చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు



శ్రీలత, టీజీఎస్ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్

వికారాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తమిళనాడులోని అరుణాచలం వెళ్లే భక్తుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఈ బస్సులను భక్తులు, యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని టీజీఎస్ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత కోరారు. ఈయాత్రకు వచ్చే భక్తులు అరుణాచలేశ్వరుడితో పాటు కాణిపాకం వినాయకుడిని, వేలూరు మహాలక్ష్మిని కూడా దర్శించుకునే అవకాశాన్ని టీజీఎస్ఆర్టీసీ కల్పించిందని ఆమె వివరించారు. ప్రత్యేక బస్సులు ఈనెల 19వ తేదీ రాత్రి 8గంటలకు హైదరాబాద్ ఎంజీబీఎస్ నుంచి బయలుదేరి 20వ తేదీ ఉదయం చిత్తూరు జిల్లా, కాణిపాకం చేరుకుంటాయని, అక్కడ వినాయకుడిని దర్శించుకున్న తరువాత తమిళనాడులోని వేలూరుకు బయలుదేరుతాయని ఆమె తెలిపారు. అక్కడ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న తరువాత అరుణాచలం చేరుకుంటాయన్నారు. 21వ తేదీన గురు పౌర్ణమి పురస్కరించుకుని అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణ చేసిన తరువాత సాయంత్రం 5 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి, 22వ తేదీ, సోమవారం ఉదయం 6గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటాయని ఆమె వివరించారు. ఒక్కొక్కరికీ రూ.3,700 ఛార్జీ నిర్ణయించారని, టికెట్లను టీజీఎస్ఆర్టీసీ బుకింగ్ కౌంటర్లు, సైట్లలో రిజర్వు చేసుకోవచ్చని ఆమె ఓ ప్రకటనలో తెలిపారు.



గంధం క్వీనిని సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న జ్ఞాన వాహిని ఫౌండేషన్ సభ్యులు

ఇంగ్లండ్ చానల్ ఈదిన తెలుగు మహిళకు సన్మానం

ఆమనగల్లు, జూలై 14 : అంతర్జాతీయ ఫిన్ స్విమ్మర్ గంధం క్వీని విక్టోరియాకు రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో ఘన స్వాగతం లభించింది. ఇటీవల ఇంగ్లాండ్ నుంచి ఫ్రాన్స్ వరకు 36కిలో మీటర్లు స్విమ్ ఎవరెస్ట్‌గా పిలుచుకునే ఇంగ్లిష్ చానల్ ఈది తొలి తెలుగు ఓపెన్ వాటర్ లేడీ స్విమ్మర్‌గా క్వీని రికార్డు నెలకొల్పింది. ఆదివారం స్వస్థలం ఆమనగల్లుకు చేరుకున్న ఆమెను ఎంబీ ప్రేయర్ టవర్ చర్చి ఆధ్వర్యంలో జ్ఞానవాహిని ఫౌండేషన్ సభ్యులు, యువకులు స్వాగతం పలికారు. అనంతరం ఎంబీ ప్రేయర్ టవర్ చర్చిలో, భవానీ గార్డెన్‌లో ఫౌండేషన్ సభ్యులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అండర్ వాటర్ స్విమ్మింగ్ పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించిన క్వీని ఇంగ్లిష్ చానల్‌ను క్రాస్ స్విమ్మింగ్ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. క్వీని అంతర్జాతీయ స్థాయిలో రికార్డు నెలకొల్పడం గర్వకారణమన్నారు. స్విమ్మింగ్‌లో రాణిస్తున్న గంధం క్వీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతవ్వాలని కోరారు. అంతర్జాతీయ స్థాయిలో తాను సాధించిన రికార్డులను తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయకుడులకు అంకితమిస్తున్నట్లు క్వీని తెలిపారు. స్విమ్మింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో భారత్‌ను అగ్రభాగాన నిలపాలన్నదే తన ధ్యేయమన్నారు. ఇంగ్లండ్‌లోని డోవర్ కోస్ట్ నుంచి రిలే స్విమ్మింగ్ ప్రారంభించి ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ కోస్ట్ వరకు ఈదిన తొలి తెలుగు మహిళగా నిలవడం తనకు ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే సెవెన్ చానల్స్ ఈదాలన్నది తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంబీ ప్రేయర్ టవర్ చర్చి నిర్వాహకులు ఎస్తేర్, బాబ్జీ, అన్నపూర్ణ, శంకర్, రవి, మంజుల, నరేందర్, జ్ఞాన వాహిని ఫౌండేషన్ సభ్యులు రవీంద్రానంద్, లక్ష్మీనారాయణ, సత్యం, రంగారావు, డాక్టర్ వాసు, విడియాల ప్రసాద్, నర్సింహులు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

'ఆరని' వీధి దీపాలు





చెర్కుపల్లి, విశ్వనాథ్‌పూర్‌లలో పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

కొందుర్గు, జూలై 14: మండల పరిధిలోని గంగన్నగూడెం, చెర్కుపల్లి, విశ్వనాథ్‌పూర్ గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు ఉన్న విద్యుద్దీపాలు పట్టపగలు కూడా వెలుగుతున్నాయి. ప్రతీ గ్రామంలో రెండు వీధులకు కలిపి విద్యుద్దీపాలకు ఆన్, ఆఫ్ సౌకర్యం ఉందని, మరో రెండు వీధుల్లో విద్యుద్దీపాలు వెలుగుతూనే ఉంటాయని, ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో దాదాపు 12 గ్రామాల్లోని వీధి దీపాలకు ఆన్, ఆఫ్‌లు లేవని గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, ఆన్, ఆఫ్ లేని గ్రామాల్లోని వీధి దీపాలకు వెంటనే ఏర్పాటు చేసి, విద్యుత్ వృథా కాకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



చింతపట్ల గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

చదువుతోనే సమాజంలో గుర్తింపు

యాచారం, జూలై 14 : చదువుతోనే సమాజంలో ప్రతీ ఒక్కరికి గుర్తింపు వస్తుందని, విద్యావ్యవస్థలో మార్పులు తేవాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ప్రొఫెసర్ దానయ్యలు అన్నారు. శనివారం సాయంత్రం యాచారం మండలంలోని చింతపట్లలో పర్యటించి గ్రామస్తుల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదోడికి ఉన్నత విద్య అందాలంటే విద్యావ్యవస్థలో ఎలాంటి మార్పులు అవసరమని విద్యావంతులు, గ్రామపెద్దలతో పాటు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన విద్య అందాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి పథకాలు అమలు చేయాలని ఆరా తీశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చదివించాలన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు శిక్షణ పొంది నాణ్యమైన విద్యనందిస్తారనే సంగతి గుర్తుంచుకోవాలన్నారు. గ్రామం అభివృద్ధి చెందాలంటే ప్రతీ ఒక్కరు విద్యావంతులు కావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీయేటా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఆంగ్లంపై ప్రతి విద్యార్థి పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో మన ఊరు-మన బడి కార్యక్రమం నిర్వాహకులు ఎండీ సాబేర్, ఉపాధ్యాయులు అంజయ్య, శ్రీకాంత్, మహేష్‌లతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రబాబు మళ్లీ సీఎం కావడం ఆంధ్ర ప్రజల అదృష్టం

» మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

మొయినాబాద్ రూరల్, జూలై 14: గత ఐదేళ్లుగా అరాచక పాలనలో నరకయాతన అనుభవించిన ఆంధ్రప్రజలు.. ఎన్డీయే కూటమి గెలుపుతో ఏపీ సీఎంగా నారా చంద్రబాబు నాయుడు ఏపీకి ముఖ్యమంత్రి కావడం అదృష్టంగా భావిస్తున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. నాలుగోసారి చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వడంతో ఆయనపై ఉన్న అభిమానంతో చంద్రబాబు పేరిట మండల పరిధిలోని ప్రముఖ క్షేత్రం చిలుకూరు బాలాజీ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీలోని శ్రీశైల క్షేత్రం వరకు టీటీడీపీ మొయినాబాద్ మండల ఇన్‌చార్జి ఎల్గని యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో నలుగురు పార్టీ నాయకులు ఆదివారం మహాపాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ముఖ్యఅతిథిగా హాజరై యాత్రను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజల శ్రేయస్సుకోసం నిత్యం పరితపించే నాయకుడు చంద్రబాబు నాయుడని అన్నారు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఏపీ ప్రజల అదృష్టమన్నారు. చంద్రబాబు నాయుడుపై ఉన్న అభిమానంతో ఇక్కడి నుంచి మొయినాబాద్ మండల నాయకులు ఏపీలోని శ్రీశైలం క్షేత్రానికి మహాపాదయాత్రగా వెళ్లడం మాములు విషయం కాదన్నారు. వారికి దారిపొడవునా టీడీపీ నాయకులు సాదరస్వాగతం పలకాలని కోరారు. అంతకు ముందు బక్కని చిలుకూరు వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కాగా, చంద్రబాబు నాయుడు ఏపీ ప్రజలకు సుపరిపాలన అందించాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ స్వామిని కోరుకొని పాదయాత్రను ప్రారంభించినట్లు ఎల్గని యాదయ్యగౌడ్ చెప్పారు. శ్రీశైలంలో కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు చెప్పారు. ఈ సందర్భంగా హిమాయత్ నగర్ చౌరస్తాలో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. పాదయాత్రలో పాల్గొన్న వారిలో కార్తీక్, లోకేష్, నాగరాజు, ఆంజనేయులు ఉన్నారు. కార్యక్రమంలో చిలుకూరు చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్, మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అశోక్‌గౌడ్, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణామాచారి, షాద్‌నగర్ ఆసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణ, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ భూపాల్‌రెడ్డి, రాఘవులు, తెలుగు యువత రాష్ట్ర నాయకుడు బుర్రకాయల వెంకటేష్ ముదిరాజ్, ఎస్సీసెల్ కమిటీ సభ్యుడు షాబాద్ మాణిక్యం, మూర్తి, హరికృష్ణ గౌడ్, మల్లేష్ ముదిరాజ్, ప్రవీన్‌కుమార్, తోలుకట్ట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చిలుకూరు బాలాజీ ఆలయంలో పూజలు చేసిన అనంతరం బక్కని, నాయకులు

వ్యాధుల కాలం.. జర పైలం

పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు

» పరిసరాలు పరిశుభ్రత ముఖ్యం » అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



బషీరాబాద్‌లో మురుగు కాల్వల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పారిశుధ్య కార్మికులు

బషీరాబాద్, జూలై 14: వానాకాలం అపరిశుభ్రత కారణంగా గిరిజన తండాలు, గ్రామాల్లో దోమలు, ఈగలు రాజ్యమేలుతుంటాయి. వర్షపు నీరు ఎక్కడపడితే అక్కడ నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది వీటి వల్ల ప్రజలు రోగాలబారిన పడుతుంటారు. మలేరియా, టైఫాయిడ్, జ్వరాలు వ్యాప్తి చెంది చిన్నాపెద్దా తేడా లేకుండా మంచంపట్టే పరిస్థితులు నెలకొంటాయి. ముఖ్యంగా మురుగు కాల్వలు, ఖాళీస్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ప్రజలు ఇంటి సరిసరాల్లో ఖాళీస్థలాల్లో నీరు నిలవకుండా చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు ముందు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

గ్రామ పంచాయతీల్లో చర్యలు

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో దోమలు వ్యాప్తి చెందకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో దోమల నివారణకు మురికి కాల్వలు, నీరు ఉన్న గుంతల్లో మందును పిచికారీ చేయిస్తున్నారు. అంతర్గత రోడ్లు, మురుగు కాల్వలు పరిశుభ్రంగా ఉండేలా పారిశుధ్య కార్మికులతో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నారు.



మైల్వార్‌లో దోమలమందు పిచికారి చేస్తున్న పంచాయతీ కార్మికులు



కొర్విచెడ్‌లో పిచ్చిమొక్కలను దగ్గరుండి తొలగింపజేస్తున్న కార్యదర్శి రాజు

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

ప్రజలు వర్షాకాలం తగు జాగ్రత్తలు తీసుకోవాలి. క్లోరినేషన్ చేసిన నీటిని, కాచి చల్లార్చిన నీటినే తాగాలి. ఇళ్ల పరిసరాల్లో పిచ్చిమొక్కలు లేకుండా, చెత్తా దాదారం లేకుండా ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమల నుంచి రక్షణ కోసం దోమ తెరలు వాడాలి. ఎప్పటికప్పుడూ వేడి ఆహారం తీసుకోవాలి. కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. ఇంటి ఆవరణ, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.

డ్రైడే నిర్వహిస్తున్నాం



మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నాం. మురుగు కాల్వలను శుభ్రం చేయించే కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాం. మురుగు కాల్వల్లో దోమల మందు పిచికారితో పాటు, నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయిస్తున్నాం. పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగుతున్నాయి.

- రమేష్, ఎంపీవో బషీరాబాద్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మన ఇళ్లచుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వీలైనంత వరకు వేడి ఆహారం భుజించాలి. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటినే తాగాలి. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ జ్వరంవస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

డాక్టర్.శ్రీకాంత్, పీహెచ్‌సీ వైద్యులు, బషీరాబాద్

గగన్‌పహాడ్‌లో బెల్టు షాపులపై దాడులు

» మద్యం సీసాల స్వాధీనం
» ఇద్దరు నిందితుల అరెస్టు

శంషాబాద్, జూలై 14: శంషాబాద్ ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధి గగన్‌పహాడ్ బస్తీలో ఆదివారం రాత్రి బెల్టు షాపులపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని బీరు, క్వార్టర్ సీసాలను స్వా ధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గగన్‌పహాడ్ బస్తీలో బెల్టు షాపుల్లో జోరుగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారనే సమాచారంతో పోలీ సులు దాడులు నిర్వహించారు. 49 బీరు, 64 క్వార్టర్ సీసాలు లభ్యమయ్యాయి. అక్రమంగా మద్యం అమ్ముతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఆర్జీఐఏ పోలీసులు తెలిపారు.

లాజిస్టిక్స్ ఏజెంట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడిరంగారెడ్డి జిల్లాలో టీజీఆర్టీసీ లాజిస్టిక్స్ ఏజెంట్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డి రీజియన్ ఏటీఎం రవీందర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని పట్టణాలు, మండల, గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ లేదా ఆసక్తి కలిగిన వారు ఆర్టీసీ లాజిస్టిక్స్ ఏజెంట్లుగా కొనసాగేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రాంతంలో రూ.5 వేలు, మండల, గ్రామీణ ప్రాంతాల్లో రూ. వెయ్యి చెల్లించి ఏజెన్సీని తీసుకోవచ్చని తెలిపారు. రంగారెడ్డి- హైదరాబాద్, కర్నాటక, మహారాష్ట్రలకు సంబంధించిన వారు భానుప్రసాద్, సెల్ నెంబరు 9154298733, పరిగి, కులకచర్ల, బొంరాస్‌పేట్, దేశాయిపేట్, గుర్మిట్కల్, యాద్గిర్ ప్రాంతాలకు సంబంధించిన వారు విశ్వనాథ్ గౌడ్, 9154298738 నెంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. తాండూరు, కొడంగల్, సేడం, చించోలి, పెద్దేముల్, ధారూరు, బంట్వారం, కోట్‌పల్లి మండలాలకు చెందిన వారు చంద్రయ్య, ఫోన్ 9154298739కు వికారాబాద్, మోమిన్‌పేట్, మర్పల్లి, చేవెళ్ల, నవాబ్‌పేట్, మన్నేగూడ, మొయినాబాద్, శంకర్‌పల్లి ప్రాంతాలకు చెందిన వారు వసంత్‌గౌడ్, ఫోన్ 9154298740లకు కాల్ చేసి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, జూలై 14 : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం నగరంలోని మంత్రి నివాసానికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి వెళ్లి మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. వారితో పలువురు నాయకులు ఉన్నారు.

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు నిధులు కేటాయించండి

» మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యేల వినతి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రాన్ని ఇస్తున్న ఎమ్మెల్యేలు

షాద్‌నగర్ అర్బన్/పరిగి, జూలై 14: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించాల్సిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేలు కోరారు. ఈమేరకు ఆదివారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో షాద్‌నగర్, పరిగి, చేవెళ్ల, తాండూరు ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, మనోహర్‌రెడ్డిలు కలిసి వినితి పత్రాన్ని ఇచ్చారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం డిజైన్‌ను మార్చి నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివేన, ఉదండాపూర్ రిజర్వాయర్ల నిర్మాణ పనులను ప్రారంభించి, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని పక్కన పెట్టిందని మంత్రికి గుర్తుచేశారు. షాద్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని చౌదరిగూడెం మండలంలో గల లక్ష్మీదేవిపల్లి వద్ద రిజర్వాయర్‌ను నిర్మిస్తే షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సైతం సాగునీరు పారుతుందని, తాగునీటి సమస్య కూడా తీరుతుందని మంత్రికి వివరించారు. వచ్చే బడ్జెట్‌లోనే నిధులు కేటాయించి, నిర్మాణ పనులను ప్రారంభించాలని ఎమ్మెల్యేలు కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగమైన కొందర్గు-పరిగి-లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యేలకు హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు అందిస్తామని తెలిపారు. పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా నీరు జిల్లాకు సాధించి తీరుతామని, గత ప్రభుత్వం ప్రాజెక్టును విస్మరించిందని, చేవెళ్ల ప్రాణహిత ప్రాజెక్టు డిజైన్‌ను దారి మళ్లించి జిల్లాకు తీరని అన్యాయం చేసిందన్నారు. వికారాబాద్ జిల్లాలో నాలుగు లక్షల ఎకరాల వరకు సాగునీరు అందనుందని తెలిపారు. పాలమూరు ఎత్తిపాతల ద్వారా ఏడాదిలోపు నీరు తీసుకవస్తామని, చేవెళ్ల ప్రాణహిత ప్రాజెక్టు ద్వారా కూడా సాగునీరు తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపినట్లు ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.



మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న శ్రీనివాస్ రెడ్డి, యాట నర్సింహ, బీక్యనాయక్

మంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

» 17న ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు రాక

కడ్తాల్, జూలై 14 : మండల కేంద్రంలో ఈనెల 17న రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యటన ఏర్పాట్లను ఆదివారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. రూ.3.50 కోట్లతో అధునాతన సదుపాయాలతో నిర్మించిన కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ భవనాన్ని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలతో కలిసి శ్రీధర్‌బాబు ప్రారంభించనున్నారు. ఆదివారం కేజీబీవీ భవనం వద్ద ఏర్పాట్లను డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి నేనావత్ బీక్యనాయక్‌లు నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. భవనం పరిసరాలు, గదులు, నీటి వసతి, విద్యుత్ సదుపాయాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. భవనం ప్రారంభం అనంతరం నిర్వహించే సమావే శానికి స్థలాన్ని పరిశీలించారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశానుసారం పెద్ద ఎత్తున ఏర్పాట్లు , జనసమీకరణ చేస్తున్నట్లు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు కేజీబీవీ భవనాన్ని ప్రారంభించిన అనంతరం సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, సేవాదల్ అధ్యక్షుడు గురిగళ్ల లక్ష్మయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గూడూరు భాస్కర్ రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాములు పట్టి.. ప్రాణాలు కాపాడుతూ..

» సంవత్సరాలుగా ప్రజలకు సహకారం » ఆజంను అభినందిస్తున్న స్థానికులు



చెల్లాపూర్‌లో ఓ ఇంట్లో కొండ చిలువను పడుతున్న ఆజం

కులకచర్ల, జూలై 14: పామును చూస్తే ఎవరికైనా గుండె గుబేలుమనాల్సిందే. పొలం పనులకు వెళ్లిన కూలీలు, రైతులకు ఎక్కువగా పాముల భయముంటుంది. వర్షాకాలంలో వరదలకు ఇళ్లలోకి, ప్రభుత్వ కార్యాలయాల్లోకి పాములు చేరుతుంటాయి. కొన్ని సందర్భాల్లో వాటిని గమనించక పాముకాటుకు గురైన వారు కూడా ఉన్నారు. అయితే, కులకచర్ల మండలవాసులకు పాములు కనిపిస్తే వెంటనే స్థానిక పాములు పట్టే ఆజంకు సమాచారం అందిస్తుంటారు. ఇళ్లలోకి పాములు చేరినా, ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో, సాగు భూముల్లో పాములు కనిపించిన వెంటనే ఆజంకు సమాచారం అందిస్తే క్షణాల్లో అతను అక్కడికి చేరుకొని పాములను పట్టుకుంటాడు. పట్టుకున్న పాములను డబ్బాల్లో, ప్లాస్టిక్ బస్తాల్లో బంధించి అటవీ ప్రాంతంలో వదులుతాడు. గత కొన్ని సంవత్సరాలుగా ఆజం పాములు పట్టి ప్రజల ప్రాణాలను కాపాడుతున్నాడు. పాముకాటుకు గురైన వారిని ఆస్పత్రికి చేరుస్తాడు. పాముల బారి నుంచి ప్రజలను కాపాడుతున్నాడు. పాములను ఎవరు చంపొద్దని, పాము కనిపిస్తే తనకు సమాచారం అందించాలని ఆజం కోరుతున్నాడు. జీవ వైవిధ్యంలో భాగంగా భూమిపై పాములు కూడా జీవించాలని ఆయన సూచించారు. పాములకు ఏదైనా నొప్పి కలిగిస్తేనే అవి కాటు వేస్తాయని, లేకుంటే వాటి దారిన అవి వెళ్లిపోతాయని తెలిపారు. ఓ స్వచ్ఛంద సంస్థ నుంచి శిక్షణ పొంది పాములు పట్టే పనిలో ఆజం నిమగ్నమయ్యాడు.

ప్రభుత్వం ఆర్థికంగా ప్రోత్సాహకం అందించాలి




ఫోన్ సమాచారం (సెల్ నెం.6301567044) రాగానే వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి పామును పట్టుకొని అడవీలో వదిలేసి వస్తాను. నా సొంత పనులున్నా సమాచారం రాగానే ఆ ప్రాంతానికి వెళ్లి పామును పట్టి అటవీ ప్రాంతంలో వదిలేస్తాను. ఎవరి నుంచి ఏది ఆశించను. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలి.

- ఆజం, పాములు పట్టే వ్యక్తి, కులకచర్ల

అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తించేలా కృషి

మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



బ్యాటరీ సైకిళ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు, జూలై 14: నియోజకవర్గం పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందేలా తన వంతు కృషి చేస్తానని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మండలంలోని మాన్యగూడ గ్రామానికి చెందిన ఎగిరిశెట్టి రాజు, కటికపల్లి గ్రామానికి చెందిన సుధాకర్‌లు అంగవైకల్యంతో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించిన ఎమ్మెల్యే ఆదివారం మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయంలో వారికి బ్యాటరీ సైకిళ్లను అందజేశారు. అనంతరం సబితాఇంద్రారెడ్డి మాట్లాడారు. తనకు మహేశ్వరం నియోజకరవ్గం ప్రజలు మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారని, వారు తనకు అందించిన చేయూతను ఎప్పుడూ మరిచిపోనన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవలందించడానికి ముందుంటానన్నారు. రెండు రోజుల క్రితం తాను కందుకూరు మండలంలో పర్యటించినప్పుడు రాజు, సుధాకర్‌లు వారి సమస్యలను తన దృష్టికి తెచ్చారన్నారు. ఈరోజు వారికి బ్యాటరీ సైకిళ్లను అందించడంతో పాటు అంగవైకల్యం ఉన్నవారికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రతీ సంక్షేమ పథకాలను అందించడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తాండ్ర దేవేందర్, ఎడ్ల ఉదయ్‌కిరణ్. తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

● ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్ రెడ్డి



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి సన్మానిస్తున్న ఎన్‌పీఆర్డీ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, జూలై 14: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. షాద్‌నగర్ బుగ్గారెడ్డి గార్డెన్‌లో ఆదివారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర మూడవ మహా సభ జరిగింది. ఎన్‌పీఆర్డీ రాష్ట్ర అధ్యక్షుడు కరువునెల్లి వెంకట్ అధ్యక్షతన జరిగిన మహాసభకు ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేని దివ్యాంగులు.. జీవనాన్ని గడపడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఇస్తున్న 3,016 రూపాయల పెన్షన్‌ను 6 వేల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు రిజర్వేషన్ల శాతాన్ని పెంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించి, ఆదుకోవాలని నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్‌పీఆర్డీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల మేరకు దివ్యాంగులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక నోటిఫికేషన్‌ను వేసి, ఉద్యోగాలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని ఈ సందర్భంగా కోరారు. అదేవిధంగా రాజకీయ నామినేటెడ్ పోస్టుల్లో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని వెంకట్ డిమాండ్ చేశారు. సదస్సులో ఎన్‌పీఆర్డీ నాయకులు ఆశన్నగారి భుజంగారెడ్డి, జె. రాజు, శ్రీనివాసులు, శేఖర్‌గౌడ్, నాగార్జున, మహేష్‌గౌడ్, బాల్‌రాజ్, యాదయ్య, బోడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


అనాథాశ్రమానికి తరలిస్తున్న పోలీసులు

వృద్ధుడిని చేరదీసిన పోలీసులు

యాచారం, జూలై 14 : మండల కేంద్రంలోని శ్రీతిరుమలేషుని గుట్ట కింద తీవ్ర జ్వరంతో బాధపడుతున్న గుర్తుతెలియని వృద్ధుడిని పోలీసులు చేరదీసి ఆగాపల్లిలోని అనాథాశ్రమానికి తరలించారు. శ్రీతిరుమలేషుని గుట్టకింద గుర్తుతెలియని వృద్ధుడు ఆదివారం తీవ్ర జ్వరంతో బాధపడుతూ అపస్మారక స్థితిలో ఉన్నట్లు పోలీసులకు సమాచారమందింది. దాంతో వారు వెంటనే వెళ్లి అతడిని మంచాల మండలంలోని ఆగాపల్లిలో గల అనాథాశ్రమంలో చేర్పించారు. అయితే, అతడు మాట్లాడడం లేదని, మూగవాడిలా ఉన్నాడని, ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో అనాథాశ్రమానికి తరలించామని పోలీసులు చెప్పారు.

వర్షాల కోసం 'కప్ప కావడి'



ఆమనగల్లు, జూలై 14: వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురిపించాలని కోరుతూ ఆదివారం ఆమనగల్లు పట్టణంలో కప్ప కావడి నిర్వహించారు. రోకలికి జోలి కట్టి కప్పతో వీధుల్లో తిరిగారు. ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులతో కలిసి కప్పకు పూజలు చేయించారు. అనంతరం గ్రామంలోని ఆలయాల్లో పూజలు చేశారు.

గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని కలిసిన ఆచారి



ఆమనగల్లు, జూలై 14: త్రిపుర గవర్నర్ ఇంద్ర సేనారెడ్డిని ఆదివారం ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఇంద్రసేనా రెడ్డిని కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆచారిని గవర్నర్ ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో బీజేపీ నాయకులు యొన్నం శేఖర్ రెడ్డి, తుమ్మేటి వెంకట్ రెడ్డి, మోహన్‌రెడ్డి, పరమేశ్‌గౌడ్, తదితరులు ఉన్నారు. అదే విధంగా మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో ఆచారితో కలిసి బీజేపీ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కుర్చీలు, కార్పెట్ల వితరణ

కేశంపేట, జూలై 14: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామ ముదిరాజ్ సంఘానికి ఆదివారం షాద్‌నగర్ తాలూకా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో షాద్‌నగర్‌కు చెందిన మహేష్‌వర్మ ముదిరాజ్, శ్రీధర్‌వర్మ ముదిరాజ్‌లు సంఘానికి కుర్చీలు, కార్పెట్లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో తాలూకా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మంగ వెంకటేష్ ముదిరాజ్, గౌరవాధ్యక్షుడు అంచ రాములు, తాలూకా ప్రధాన కార్యదర్శి మల్లేష్ పూజారి, అందె పైలయ్య, కొండా యాదయ్య ముదిరాజ్, బాలరాజ్, తదితరులున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

● రోడ్డుపక్కన గుంతలు.. పట్టించుకోని అధికారులు ● తాత్కాలికంగా స్టాపర్ల ఏర్పాటు.. మరమ్మతులు నిల్


కడ్తాల మండల కేంద్రంలో రోడ్డు పక్కన ఏర్పడ్డ గోతి


తలకొండపల్లి వెళ్లేదారిలో కడ్తాల మండల కేంద్రంలో ప్రమాదకరంగా ఉన్న గోతి వద్ద ఏర్పాటు చేసిన స్టాపర్

కడ్తాల్, జూలై 14 : మండల కేంద్రంలో తలకొండపల్లి చౌరస్తా వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి పక్కన గోతులు ప్రమాదకరంగా మారాయి. నిత్యం వందలాది వాహనాలు వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే రహదారిపై గోతులతో పెను ప్రమాదం పొంచి ఉంది. తలకొండపల్లి చౌరస్తా వద్ద ఇప్పటికీ నిత్యం ఏదో ఓ ప్రమాదం చోటుచేసుకుంటూనే ఉంది. అయినా, స్పందించని ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో ఉన్న హైదరాబాద్-శ్రీ శైలం జాతీయ రహదారిని ఎనిమిదేళ్ల క్రితం విస్తరించి జాతీయ రహదారిగా మార్చారు. రోడ్డు పక్కనుంచి వర్షపు నీరు పోవడానికి వీలుగా జాతీయ రహదారిని అనుసరించి భారీ కాలువను నిర్మించారు. కాలువపై రహదారి మధ్యలో వేసిన స్లాబ్ వాహహనాల రద్దీ ఒత్తిడితో చాలా చోట్ల ధ్వంసం అయ్యింది. కడ్తాల చౌరస్తాలో తలకొండపల్లి వెళ్లేదారిలో రెండుచోట్ల కాలువపై స్లాబ్ నిర్మాణం పాడై ఇనుప చువ్వలు తేలాయి. రహదారి మధ్యలో స్లాబ్ పాడవ్వడంతో గోతులతో నెలల కాలంగా వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక నాయకులు పలుమార్లు ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల దృష్టికి కూడా సమస్య తీసుకుపోయారు. రోడ్డు మధ్యలో ఏర్పడ్డ గోతి వద్ద పోలీసులు స్టాపర్స్ ఏర్పాటు చేశారు. దగ్గరకు వచ్చి చూస్తే గానీ.. కనిపించని గోతుల వల్ల ద్విచక్ర వాహనాదారులు ఎక్కువ ప్రమాదాలకు లోనవుతున్నారు. తలకొండపల్లి చౌరస్తాలో రద్దీ ఓవర్‌లోడ్‌తో వెళుతున్న వాహనాల వల్ల కాలువపై స్లాబ్ నిర్మాణం ధ్వంసం అవుతోంది. దాన్ని దృష్టిలో పెట్టుకొని రోడ్డు మధ్యలో ఉన్న కాలువపై పూర్తిస్థాయిలో స్లాబ్‌ను తొలగించి నాణ్యతతో రద్దీని తట్టుకునేలా కొత్తస్లాబ్ నిర్మించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. రెండు, మూడు రోజుల్లో రోడ్డు మధ్యలో గోతులపై స్లాబ్ నిర్మాణం చేపట్టకపోతే ఆందోళనకు దిగుతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఆదివార సాయంత్రం కాంగ్రెస్ నాయకులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, చేగూరి వెంకటేష్, రాంచందర్‌నాయక్, శంకర్, మల్లేష్‌గౌడ్, జగన్‌గౌడ్, పిప్పల యాదయ్యతదితరులు గోతులను పరిశీలించారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారి గంగాధర్ దృష్టికి తీసుకుపోగా.. పరిశీలిస్తామని అధికారులు తెలిపినట్లు డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవనం

కడ్తాల్, జూలై 14: ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవనం పొందవచ్చునని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్‌లు అన్నారు. మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. నాయకులు పాండు, మహేశ్, లక్ష్మణ్, గణేశ్, జగన్, దశరథ, తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న దశరథ్ నాయక్, ఆనంద్

ఘనంగా ఆషాఢం బోనాలు


వీరభద్రకాలనీలో బోనాలతో ఆలయానికి తరలివెళుతున్న మహిళలు

చేవెళ్ల, జూలై 14 : పోతురాజుల విన్యాసం, శివసత్తుల పూనకాలతో ఆశాఢమాసం బోనాలు ప్రజలు ఘనంగా నిర్వహించారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని వీరభద్ర కాలనీలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బోనాల సందర్భంగా సందడి నెలకొంది. మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లతో కాలనీ మార్మోగింది. అమ్మవారికి మహిళలు బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో రాజకీయ నాయకులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యాదయ్య

నగరంలోని ప్రజాభవన్‌లో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం విక్రమార్కతో పాటు జిల్లాలోని నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.


బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి

అట్టహాసంగా ఎంపీ మల్లు రవి జన్మదిన వేడుకలు


:ఆమనగల్లులో కేక్‌కట్ చేస్తున్న మండ్లీ రాములు, మానయ్య, శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి, జూలై 14: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు, పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి జన్మదిన వేడుకలు ఆదివారం ఆమనగల్లు పట్టణంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు వస్పుల మానయ్య, జిల్లా నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గాజుల శ్రీనివాస్, గండికోట మల్లేశ్, జంతుక యాదయ్యలతో కలిసి రాములు కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు. పలుచోట్ల మొక్కలు నాటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నాయకులు శ్రీరాములు, కుమార్‌గౌడ్, విజయ్‌రాథోడ్, శ్రీను నాయక్, మల్లేశ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. ఆమనగల్లు బస్టాండ్ వద్ద కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్ ఆధ్వర్యంలో రవి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఖలీల్, కొండల్‌రెడ్డి, ధనుంజయ్య, ప్రసాద్, అలీం, ఖాదర్‌ఖాద్రీ, శ్రీను నాయక్, రఫీ, నాజర్, తదితరులున్నారు. కడ్తాల మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీక్యానాయక్ ఆధ్వర్యంలో రవి జన్మదిన వేడుకలు నిర్వహించారు. బస్టాండ్‌కూడలిలో కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. బీక్యానాయక్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, జహంగీర్‌బాబా, లక్ష్మయ్య, చేగూరి తదితరులున్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో మోహన్‌రెడ్డి, అంజయ్య, భగవాన్ రెడ్డి, రవీందర్, అజీం, డిగ్రీ కృష్ణ, దామోదర్, తదితరులున్నారు. అలాగే మల్లు రవికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా నాయకులు వస్పుల జంగయ్య, గుర్రం కేశవులు, జెల్ల రమేశ్‌గౌడ్, పీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డిలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


కడ్తాల : రవి జన్మదిన వేడుకల్లో నాయకులు

సేవాలాల్ మార్గం అనుసరణీయం


సేవాలాల్ విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న రవీందర్ నాయక్,

ఆమనగల్లు, జూలై 14: సంత్ సేవాలాల్ మార్గం అందరికీ అనుసరణీయమని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, రాష్ట్ర గిరిజన సేవా సంఘం నాయకుడు నేనావత్ రవీందర్ నాయక్ అన్నారు. మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ప్రతీ ఒక్కరు సమాజ సేవలో పాలుపంచుకోవాలని కోరారు. ఆమనగల్లు పట్టణంలోని సంత్ సేవాలల్ ఘాట్ వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో గిరిజన నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సంత్ సేవాలాల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవాలాల్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలు రూపొందించి గిరిజనుల అభివృద్ధికి చేయూతనందించాలని రవీందర్ నాయక్ కోరారు. ఆమనగల్లు సేవాలాల్ గుట్ట వద్ద ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ పరంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. గిరిజనులంత సంత్ సేవలాల్ చూపిన మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవిని కలిసి కల్వకుర్తి నియోజకవర్గంలో గిరిజన సంక్షేమం, తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని అభ్యర్థించారు. ఇళ్లు లేని గిరిజన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి వారి సొంతింటి కలనుసాకారం చేయాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు రవీందర్ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణనాయక్, దశరథ్ నాయక్, రాములు నాయక్, శ్రీను నాయక్, శంకర్ నాయక్, సురేశ్ నాయక్, శ్రీను, లండం చంద్రయ్య, జంతుక జానయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం


శిక్షణ పొందిన విద్యార్థులతో రాజేష్ పటేల్

కొందుర్గు, జూలై 14: ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని, ప్రతీఒక్కరు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని న్యూమాంక్స్ కుంగ్‌ఫూ జిల్లా అధ్యక్షుడు రాజేష్ పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జీఎం పటేల్ గార్డెన్‌లో కటాస్, స్పైరింగ్ విభాగాల్లో విద్యార్థులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ పటేల్ మాట్లాడుతూ మాస్టర్ రమేష్ 20 సంవత్సరాలుగా విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, బెల్టులు ప్రదానం చేశారు. మాస్టర్లు రమేష్, బాలరాజ్, రాజు, నందు, రాము, నరేష్, గౌతమ్ తదితరులున్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం

షాబాద్, జూలై 14 : గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటిని సరఫరా చేసేందుకు దాతలు ముందుకు వచ్చి వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అంబేడ్కర్, మిత్రచైతన్య యువజన సంఘాల అధ్యక్షులు వడ్ల చంద్రశేఖర్‌చారి, అక్కమొల అంజనేయులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ వారి సహకారంతో ఎనీటైం వాటర్ ప్లాంటు(ఏటీడబ్ల్యూ)ను సంస్థ ఆర్గనైజర్ వినోద్‌తో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయడంతో ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు కృషి చేసినవారికి కృతజ్ఞతలు తెలిపారు. వర్షాకాలంలో ప్రజలు మంచినీరు తాగడం వల్ల ఆరోగ్యంగా, రోగాల బారిన పడకుండా ఉంటారన్నారు. గ్రామస్థులు అందరు ఇంటింటికీ రూ.500 రూపాయలు చందా వేసుకున్నట్లు తెలిపారు. అందరి సహకారంతో ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ మద్దూరి పాండు, గ్రామస్థులు రమేష్ పంతులు, జంగయ్య, మల్లేష్, లోక్‌నాథ్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, బాల్‌రాజ్, రాములు, పురుషోత్తంచారి, సుమన్, శ్రీనివాస్, ప్రవీణ్, కుమార్ తదితరులు ఉన్నారు.


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

సంక్షిప్తంగా..

ఆమనగల్లు : ఆమనగల్లు జడ్పీ బాలికల పాఠశాల 1989-90ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సంఘం నాయకులు, మాజీ జడ్పీటీసీ హరిప్రసాద్ ఆధ్వర్యంలో నాటి గురువులు ఖాజామైనోద్దీన్, సత్యనారాయణలను సత్కరించారు.

ఆమనగల్లు : యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష పదవికి పోలెపల్లికి చెందిన యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్న శివసేనారెడ్డి రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు.

షాబాద్ : తాళ్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 1996-97 విద్యా సంవత్సరం టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. శ్రీధర్, శ్రీకర్, లింగం, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : లాండ్రీలు, సెలూన్ షాపుల పెండింగ్ విద్యుత్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర రజక సంఘం జేఏసీ చైర్మన్ పంజగారి ఆంజనేయులు స్పష్టం చేశారు. రజక, నాయీబ్రాహ్మణులకు ఉచితంగా అందిస్తున్న విద్యుత్ పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలన్నారు.

చేవెళ్ల : చేవెళ్ల జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 2011-12 పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. నాటి ఉపాధ్యాయులు రాజు, మల్లేష్, నాగరాణి, యాదయ్య, యాదిలాల్, యాదగిరి, సత్యం, మంజుల, రమేశ్‌లను శాలువలతో ఘనంగా సన్మానించారు.

యాచారం : పదోతరగతి క్లాస్‌మేట్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న 2004-05 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం రూ. 40వేల ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు. చింతపట్లకు చెందిన సుధాకర్ కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చులకు తోటి స్నేహితులు రూ.40వేలు అందించారు. పీడీ ఎండీ సాబేర్, పి.హరి, తదితరులున్నారు.

యాచారం : అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని లష్కర్‌గూడలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా యాచారం, హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీసులు ఏడుగురు బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలను ముందస్తు అరెస్టుచేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఎండీ ఖాజుద్దీన్, శేఖర్, శివమోదీ తదితరులు ఉన్నారు.

కందుకూరు : కందుకూరు ఉన్నత పాఠశాలలో 2003-2004, తిమ్మాపురం ఉన్నత పాఠశాలలో టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఉపాధ్యాయులు చంద్రమోహన్‌రెడ్డి, అయూబ్, లక్ష్మారెడ్డి, ఆనంద్‌కుమార్, నర్సింహ, శ్రీనివాస్, యాదగిరి, రవీందర్, గోవర్ధన్, విజయభాస్కర్‌రెడ్డి, రాజిరెడ్డి, కృష్ణారెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

భార్య ఉండగా.. మరో మహిళతో వివాహం!

● పెళ్లిని అడ్డుకునేందుకు మొదటి భార్య విఫలయత్నం
● గుట్టుచప్పుడు కాకుండా రెండో వివాహం చేసుకున్న భర్త
● పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు.. విచారణ

శంషాబాద్ రూరల్, జూలై 14: గుట్టు చప్పుడు కాకుండా రెండో వివాహం చేసుకోబోయిన భర్తను భార్య అడ్డుకునేందుకు యత్నించిన సంఘటన శంషాబాద్ మండలం నర్కూడ గ్రామ శివారులోని ఓ ఫాంహౌస్‌లో జరిగింది. శంషాబాద్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన కవిత, సిద్ధార్థలు 2013లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఏడేళ్ల కూతురు ఉంది. కాగా, కొన్ని రోజులుగా కవితను సిద్ధార్థ కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేయడంతో పాటు ఆమెను వదిలించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో సిద్ధార్థ ఆదివారం వేరే మహిళను పెళ్లి చేసుకునేందుకు గుట్టు చప్పుడు కాకుండా శంషాబాద్ శివారు నర్కూడ గ్రామ సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో ఏర్పాట్లు చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న మొదటి భార్య కవిత శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు ఫాంహౌస్ దగ్గరికి వెళ్లి పెళ్లిని అడ్డుకునే ప్రయత్నం చేసింది. ఆమె రాకను పసిగట్టిన సిద్ధార్థ అక్కడి నుంచి పారిపోయి వేరేచోట ఓ గుడిలో పెళ్లిచేసుకున్నట్లు సమాచారం. కాగా, బాధితురాలు డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు స్పందించారు. సిద్ధార్థ్ మరో వివాహం చేసుకునేందుకు ఆహ్వానించిన బంధువులు అక్కడికి బస్సులో చేరుకోగా.. పెళ్లి జరగడం లేదని తెలుసుకున్న బంధువులు బస్సులో వెనుతిరిగి వెళ్తుండగా కవిత బస్సుకు అడ్డం కూర్చొంది. ఈ సందర్భంగా కవితకు పలువురు మహిళా సంఘాల నాయకురాల్లు మద్దతు తెలిపారు. దాంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. పోలీసులు బాధితురాలికి నచ్చజెప్పి అక్కడి నుంచి పెళ్లికి వచ్చిన బస్సును పంపించారు. సిద్ధార్థ్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రేషన్ డీలర్ మృతి

చేవెళ్ల, జూలై 14 : హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం సైకిల్‌పై వెళ్తున్న రేషన్ డీలర్‌ను ఢీకొట్టడంతో మృతి చెందిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని హస్తేపూర్ గ్రామానికి చెందిన బాల్‌రాజ్(36) గ్రామంలో రేషన్ డీలర్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి భార్యతో గొడవపడి ఇంటిపక్క ఉన్న వ్యక్తి సైకిల్ తీసుకొని చేవెళ్ల వైపు బయలుదేరాడు. మండల పరిధిలోని దామరిగిద్ద గ్రామం స్టేజీ వద్దకి రాగానే గుర్తుతెలియని వాహనం సైకిల్‌ను ఢీకొట్టింది. దాంతో బల్‌రాజ్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు పోలీస్‌లకు సమాచారం అందించడంతో వచ్చి మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాల్‌రాజ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవులు పట్టివేత

యాచారం, జూలై 14 : నల్గొండ జిల్లా మల్లేపల్లి సంత నుంచి మహేశ్వరం మండలంలోని తుక్కుగూడకు అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు పట్టుకొని గోశాలకు తరలించారు. ఆదివారం సాయంత్రం యాచారం పోలీసులు మాల్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా బొలెరో(టీఎస్05జెడీ 1506) వాహనంలో తాళ్లతో కట్టేసి ఆరు కోడెలు, మూడు ఆవులను తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దాంతో వాటిని పోలీస్ స్టేషన్‌కు.. తర్వాత నగర శివారులోని గోశాలకు తరలించారు. డ్రైవర్ శంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాల్ తెలిపారు.

అర్హులకు వర్తించని 'గృహజ్యోతి'

● 12,800 మంది వినియోగదారులు.. 6,400 మందికే జీరో బిల్లులు
● అర్హులందరికీ వర్తింపజేయాలని ప్రజల వేడుకోలు

కొందుర్గు, జూలై 14: గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించిన వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం ఉండదని, వారికి జీరో బిల్లులు ఇవ్వడం జరుగుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ మేరకు అర్హులైన వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. కాగా, మండల కేంద్రంతో పాటు మహదేవ్‌పూర్ (ఉత్తరాస్‌పల్లి), చిన్న ఎల్కిచర్ల, ఆగిర్యాల గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. కొందుర్గు మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 12,800 మంది గృహ విద్యుత్ వినియోగదారులున్నారు. వీరందరూ కూడా ప్రజాపాలనలో గృహజ్యోతిలో జీరో బిల్లుల కోసం దరఖాస్తులు అందజేశారు. కానీ, వారిలో 6,400 మందికి మాత్రమే జీరో బిల్లులు వస్తుండగా, మిగితా వారికి జీరో బిల్లులు రావడం లేదు. జీరో బిల్లులు రానివారు గృహజ్యోతి వర్తింపు కొరకు ఎవరిని సంప్రదించాలో తెలియడం లేదని వాపోతున్నారు. తమకు జీరో బిల్లు వస్తుందని భావించినా రావడం లేదని తెలిపారు. పక్కింటి వారికి జీరో బిల్లు వచ్చింది.. మాకు ఎందుకు రావడం లేదని వినియోగదారులు అంటున్నారు. గృహజ్యోతి కోసం దరఖాస్తులు అందజేసిన వారందరికీ జీరో బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు. అయితే, రేషన్ కార్డులో ఒకపేరు ఉండడం, విద్యుత్ కనెక్షన్ మరొకరి పేరుపై ఉండడంతో కొంత మందికి జీరో బిల్లులు రావడం లేదని, మరి కొంతమంది వినియోగదారులు ప్రజాపాలన దరఖాస్తుకు విద్యుత్ బిల్లును జతపరచకపోవడంతో జీరో బిల్లులు రావడం లేదని, ప్రజాపాలన దరఖాస్తులో విద్యుత్ సర్వీస్ నెంబర్ వేయాల్సిన చోట యూనిక్ నెంబర్స్ వేయడంతో సమస్యలు తలెత్తాయని, కొన్నచోట్ల సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని విద్యుత్ అధికారులు తెలిపారు. జీరో బిల్లులు రానివారు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసుకునేందుకు గాను దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఇందుకోసం ప్రజా పాలన రశీదును, ఆధార్ కార్డును, విద్యుత్ బిల్లులను జతపరిచి మరోసారి దరఖాస్తులను అందజేయాలని అధికారులు తెలిపారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్‌ను సంప్రదించగా జూన్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి జూలైలో జీరో బిల్లులు వచ్చాయని, జీరో బిల్లులు రాని వారు ఉంటే ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని, ఇది నిరంతరంగా కొనసాగే ప్రక్రియ అని విద్యుత్ అధికారులు తెలుపుతున్నారు.

కూలుతున్న ఇంటితో స్థానికుల ఇక్కట్లు

● వర్షానికి రోజుకింత కూలుతున్న వైనం
● ఇంటిని వెంటనే కూల్చివేయాలని స్థానికుల వినతి


పెద్ద ఎల్కిచర్లలో రోజుకింత కూలిపోతున్న ఇల్లు

చౌదరిగూడ, జూలై 14: ఇళ్ల మధ్యన ఉన్న ఓ ఇల్లు వర్షాలకు రోజురోజుకూ కొంతమేర కూలిపోతోందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. యజమానికి, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని చుట్టుపక్కల వారు వాపోతున్నారు. మండల పరిధిలోని పెద్దఎల్కిచర్లలో రాంచంద్రారెడ్డికి చెందిన పాత ఇల్లు వర్షానికి కొంత కొంతగా కూలిపోతోందని, దానిని కూల్చి వేయాలని వారం క్రితం పంచాయతీ కార్యదర్శి కుమార్‌కు విన్నవించినట్లు స్థానికులు తెలిపారు. చిన్న పిల్లలు, వృద్ధులు అటు వైపు నుంచి వెళ్లడానికి జంకుతున్నారని, ఏ సమయంలో ఇల్లు మిగతా భాగం కూలిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇళ్ల మధ్యన ప్రమాదభరితంగా ఉన్న ఇంటిని వెంటనే తొలగించాలి డిమాండ్ చేస్తున్నారు.